## నూతన AMC ఛైర్మెన్ గా బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల సత్యనారాయణ

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 20(డి డి 9 వార్త ):-**




ఈరోజు మల్లెపూల సత్యనారాయణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
"నా పై నమ్మకం తో నాకు AMC చైర్మన్ బాధ్యతలు అప్పగించినా ప్రజా ప్రభుత్వానికి నా క్లిష్ట పరిస్థితుల్లో నా తో నిలిచినా PCC అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, వేం నరేందర్ రెడ్డి, సుదర్షన్ రెడ్డి, జూపెల్లి కృష్ణ రావు గారికి, ప్రేమ్ సాగర్ రావు గారికి, DCC అధ్యక్షులు నరేష్ జాదవ్ గారికి,సోయం బాపూరావు గారికి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి గారికి, బోథ్ నియోజక వర్గ ఇంచార్జి ఆడే గజేందర్ గారికి అదేవిదంగా నాకు సహకరించిన నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు.. నాకిచ్చిన ఈ బాధ్యతతో వ్యవసాయ మార్కెట్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, రైతులకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, వారి పంటలకు సరైన ధరలు లభించేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు అభిమానులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## ఉప్లూర్ గ్రామానికి గర్వకారణం: పదవ తరగతి మండల టాపర్ల సన్మానం

**నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. గ్రామానికి చెందిన సిరిగిరి షాలిని 568 మార్కులు, కృష్ణా శ్రీ 517 మార్కులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కమ్మర్‌పల్లి మండల టాపర్లుగా నిలవడం పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో చదువుతూనే మండల స్థాయి టాపర్లుగా నిలవడం మా గ్రామానికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తక్కురి శేఖర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, అజయ్, సంతోష్, సురేష్, రాకేష్, రవి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం: బి.మల్లేష్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ విమర్శించారు. బుధవారం బోధన్ మండలం అందాపూర్ గ్రామంలోని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, మండుతున్న ఎండల నుంచి రక్షణ కోసం కనీసం టెంట్లు, తాగడానికి మంచినీరు, అత్యవసర చికిత్స కోసం ఫస్ట్ ఎయిడ్ బాక్సుల వంటి కనీస ఏర్పాట్లు లేకపోవడం శోచనీయమన్నారు. కూలీలకు ప్రతి వారం వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారం వారం బట్వాడాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రజలను ఉపాధి లేని వారిగా మారుస్తోందని మల్లేష్ ఆరోపించారు. ఉపాధి హామీ నిధుల వాటాను గతంలో కేంద్రం 90 శాతం భరిస్తుండగా, ప్రస్తుతం దానిని 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై భారం వేసిందని, దీనివల్ల నిధుల కొరత ఏర్పడి పనులు కుంటుపడుతున్నాయని ఆయన మండిపడ్డారు. పేద ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా కేంద్రం విధానాలు ఉన్నాయని, కార్మికులకు చట్టపరమైన కనీస సౌకర్యాలన్నీ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలి

- **రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి**
- **బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిశీలన.**
- **గంజాయి, గుడుంబా, రాయితీ బియ్యం, పశువుల అక్రమ రవాణా పై దృష్టి సారించాలి.**
- **గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలి.**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**



మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతూ పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరిశీలించడం జరిగింది. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితి గతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదే విధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి, బజార్హత్నూర్ ఎస్ఐ జి రమేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








## పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం కొనసముందర్ గ్రామంలో సుదీర్ఘకాలం పాటు పారిశుద్ధ్య కార్మికులుగా సేవలందించిన మేకల గంగారం, పత్రి ముత్తయ్యలకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెజ్జరం రాకేష్ మాట్లాడుతూ, వయస్సు రీత్యా ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు వర్తించని కారణంగా, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పదవీ విరమణ కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో వీరిద్దరి పాత్ర ఎంతో కీలకమని, ముఖ్యంగా కరోనా కష్టకాలంలో వారు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారు చూపిన చిత్తశుద్ధిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

## పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ సభ్యునిగా నియమితులైన బస వేణుగోపాల్ యాదవ్‌కు ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ సభ్యునిగా నియమితులైన బస వేణుగోపాల్ యాదవ్‌ను ఉప్లూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. మండలంలోని ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పదవిని చేపట్టిన వేణుగోపాల్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తక్కురి శేఖర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు కొమ్ముల సంతోష్, దాసరి రాకేష్, అనిల్, అజయ్, రవి, సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ అశ్వపతి, కారోబార్ బాజీసబ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులు జిలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి: అల్లె జనార్ధన్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

నేల సారాన్ని, సాంద్రతను కాపాడేందుకు రైతులు జిలుగు విత్తనాలను వినియోగించాలని సాలూర సహకార సంఘం అధ్యక్షులు అల్లె జనార్ధన్ సూచించారు. బుధవారం సాలూర సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు జిలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ సీడ్స్ వారి సహకారంతో ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. సేంద్రియ పద్ధతుల్లో భూమిని సారవంతం చేసుకోవడానికి ఇది ఎంతో దోహదపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నేల సాంద్రతను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ గంటే ఓట్లప్ప, రైతులు బండె శివరాజ్, లింబయ్య, భూమయ్య, లక్ష్మణ్, దత్తు, సంఘం ఇంచార్జి కార్యదర్శి సంజీవ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఆర్డీవోను కలిసి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

బోధన్ నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన విజయ కుమారిను బుధవారం బీజేపీ బోధంబోధం పట్టణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు పసుపులేటి గోపికిషన్ ఆధ్వర్యంలో కార్యాలయానికి వెళ్లిన నాయకులు, ఆర్డీవోకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బోధన్ ప్రాంత అభివృద్ధిలో ఆర్డీవో సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, మాజీ కౌన్సిలర్ ధర్మపురి, మాజీ ఫ్లోర్ లీడర్ వినోద్ చిన్న, సీనియర్ నాయకులు గుంత గంగాధర్, హనుమాన్ల చారి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఎనుగంటి గౌతమ్ గౌడ్, నాయకులు పేర్క వెంకటేష్, చరణ్ చింటూ, దుర్గాప్రసాద్, కన్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



## సాలూరలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు బుధవారం సాలూర రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి రుద్రూరులోని ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు. వానకాలం పంటల సాగు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల సమర్థ వినియోగం, చీడపీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా చర్చించనున్నారు. ఈ అవకాశాన్ని సాలూర మండలంలోని రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## భూసార పెంపునకు 'జీలుగు' విత్తనాల పంపిణీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 20(డీడీ9 వార్త) :**

రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటున్న తరుణంలో, నేలను సారవంతం చేసేందుకు రైతులు జీలుగు సాగును చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్వేత సూచించారు. సాలూర సహకార సంఘం ఆధ్వర్యంలో సబ్సిడీ ధరపై జీలుగు విత్తనాలను అందుబాటులో ఉంచామని, ఒక్కో బ్యాగును రూ. 2,453కే అందజేస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుగా పనికొచ్చే జీలుగును సాగు చేయడం వల్ల నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందని, దీనివల్ల వరి వంటి ప్రధాన పంటలకు మంచి దిగుబడి వస్తుందని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక సొసైటీని సంప్రదించి విత్తనాలను తీసుకోవాలని సూచించారు.

